

నగర పాలక సంస్థ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సి. అరుణ్ రాజ్ పై క్రమశిక్షణ చర్యలలో భాగంగా సస్పెండ్ చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ అసిసెంట్‌తోపాటు ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులైన డేటా ఎంట్రీ ఆపరేటర్ వి. ప్రేమ్ కార్తీక్, డ్రైవర్ ప్రతాప్, అటెండర్ యు.రాజ్ కుమార్‌ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా తక్షణమే విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. సస్పెండ్‌కు గురైన వారం కమిషనర్ వారి క్యాంపు కార్యాలయంలో కమిషనర్ వారు లేని సమయంలో పేకాట ఆడారరన్నారు. ఈనెల 27న ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం కావడంతో క్రమశిక్షణ చర్యలలో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌ని సస్పెండ్ చేస్తూ, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పూర్తిగా విధులనుంచి తొలగించామన్నారు.

ఇరిగేషన్‌లో..హైహై నాయకా!



ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ చీఫ్ఇంజినీర్ కార్యాలయంలో ఇష్టారాజ్యం నడుస్తోంది. ఒకే అధికారి 30 ఏళ్ల కిందట నుంచి జూనియర్, సీనియర్ అసిస్టెంట్, బడ్జెట్ సూపరింటెండెంట్ వరకు అద్దె వాహనాల చెల్లింపుల సీటులో ఉండడం సమస్యకు మూల కారణమని తెలుస్తోంది. అధికారికి వివిద హోదాలు లభించినప్పటికీ అద్దె చెల్లింపుల సీటులోనే ఏళ్ల తరబడి ఉండడంతో వాహనాల అద్దె చెల్లింపుల్లో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి క్వార్టర్‌లో ప్రతి వాహనదారు నాలుగు నుంచి ఆరు శాతం వరకు చెల్లించుకోవాల్సి వస్తోందనే ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి.

- వాహనాలకు అద్దె చెల్లింపుల్లో చేతివాటం
- అన్నమయ్యలో రూ.40 లక్షలు పెండింగ్
- 4 శాతం ముట్టజెప్పకపోతే అంతే సంగతులు
- 30 ఏళ్లుగా అదే సీటులోనే బడ్జెట్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఐదు నీటిపారుదల శాఖ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. చీఫ్ఇంజినీర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డివిజనల్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీరింగ్ హోదాల్లో పలువురు విధులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరిధిలోని ఐదు నుంచి ఆరు అద్దె వాహనాలు ఉన్నాయి. ఈలెక్కన సుమారు 25 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరిధిలో సుమారు 106 వరకు అద్దె వాహనాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి అద్దె వాహనానికి రూ.35 వేల నుంచి రూ.60 వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి అద్దె వాహనాల చెల్లింపులకు నిధులు విడుదల చేస్తోంది. బడ్జెట్ సూపరింటెండెంట్ చీఫ్ ఇంజినీర్ దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అద్దె వాహనాలకు చెల్లింపులు చేయాల్సి ఉంది.

అన్నమయ్యలో రూ.40 లక్షలు పెండింగ్

అన్నమయ్య డివిజన్‌లోని అద్దె వాహన యజమానులకు ఐదేళ్ల కిందట చేసిన రూ.25 లక్షల చెల్లింపులకు కమిషన్ చెల్లించలేదనే ఉద్దేశంతో చెల్లింపులు నిలిపేయడం చర్చనీయాంశంగా మారింది. ఈలెక్కన 30 నెలలుగా సుమారు రూ.40 లక్షలు అద్దె వాహనాలకు చెల్లింపులు చేయలేదనే వాదన వినిపిస్తోంది. ఐదేళ్ల కిందటి చెల్లింపులకు తాజాగా కమిషన్ ఇవ్వాలనే డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల బదిలీల్లో వచ్చిన ఇంజినీర్లు గతంలో చేసిన చెల్లింపులకు తామెందుకు కమిషన్ ఇవ్వాలని ప్రశ్నిస్తుండడం గమనార్హం.

4 శాతం చేతివాటం!

బడ్జెట్ సూపరింటెండెంట్ అద్దె వాహనాలకు అద్దె చెల్లింపుల్లో ఇష్టారాజ్యంగా వ్యహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇరిగేషన్‌లోని ప్రతి అద్దె వాహన యజమాని నాలుగు శాతం నుంచి ఆరు శాతం వరకు ముడుపులు చెల్లించాల్సి వస్తున్నట్లు సమాచారం. లేనిపక్షంలో వారికి ఏళ్ల తరబడి చెల్లింపులు చేయని పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి అద్దె వాహన యజమాని సగటున రూ.1,500 నుంచి రూ.1,800 వరకు చేయి తడపాల్సిందేనని తెలుస్తోంది. ఈలెక్కన జిల్లాలోని 106 వాహనదారుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

తాఖీదులు..భేఖాతర్

అద్దె వాహనాల యజమానులు ప్రజాసమస్యల పరిష్కారవేదిక, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై సంబంధిత ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేసినట్లు తెలుస్తోంది. అద్దె వాహనాలకు అద్దె చెల్లింపులు చేసినట్లు ఒప్పుకుని లెటర్ ఇవ్వాలని ఓ చీఫ్ఇంజినీర్ ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీనికి అంగీకరించని వాహన యజమానులు మరోసారి రాష్ట్ర కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- మున్సిపల్ కార్మికుల ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు 25 సంవత్సరాల నుంచి కడప నగరంలో పంచాయతీ నుంచి కార్పొరేషన్ వరకు ప్రజలకు సేవలు చేస్తూనే ఉన్నారని, వారు చేసే పనికి సంబంధించి కేడర్ అనేది లేదని, నాన్ పిహెచ్ వర్కర్ పెట్టి కార్మికులను ప్రభుత్వాలు మోసాలు చేస్తున్నాయని తెలిపారు. వారు ఏ పని చేస్తున్నారో అదే కేడర్ వారికి ఇవ్వాలన్నారు. ఈవిషయం పలుమార్లు అధికారులను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. మున్సిపల్ ఇంజనీర్ కార్మికులకు జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలు పెంచాలని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వము మోసం చేసిందని కేవలం 15000 నుంచి 18500 పెంచడం చాలా దుర్మార్గమని ఆయన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ మనోజ్ రెడ్డి క వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. రామ్మోహన్ అధ్యక్ష కార్యదర్శులు పి.చంద్ర రెడ్డి పివి.సుబ్బయ్య మున్సిపల్ జిల్లా కోశాధికారి కా ఎస్ గోపి. జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.ఆనందరావు టి. బ్రహ్మానందరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వై.ఎం. కేశవులు, ప్రజానాట్యమండలి కో కన్వీనర్ సి.పి. రమణ, నగర నాయకులు రామ్మోహన్ రెడ్డి, శ్రీధర్, కేశవ, శ్యాం బాబు, చిన్న రాయుడు, సోమిరెడ్డి, సత్యనారాయణ, వీరనారాయణ, నాగరాజు, మస్తాన్, నాగేంద్ర, సురేంద్ర ప్రదీప్ కుమార్, ప్రవీణ్, మహేశ్వర్ రెడ్డి, శ్రీను కార్మికులందరూ పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు మొదలుపెట్టండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని 18వ డివిజన్ పరిధిలో ఉన్న విశ్వనాథపురంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పరిధిలో స్థానికులకు నష్టపరిహారం చెల్లించి వెంటనే పనులు మొదలుపెట్టాలని, లేనిపక్షంలో ప్రజల తరపున పోరాట దీక్ష మొదలు పెడతామని డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కమిషనర్ మనోజ్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప నగర పరిధిలోని 18వ డివిజన్‌లో విశ్వనాథపురంలో రైల్వే అండర్ బ్రిడ్జి ఆగిపోయాయని చెప్పారు. అక్కడ ఉన్న ఇళ్లకు కార్పొరేషన్ వారు నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. ఒక సంవత్సర కాలంగా విశ్వనాథపురం ప్రజల రాకపోగాలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులకు వెంటనే తగు ఆదేశాలు ఇచ్చి నష్టపరిహారం ప్రజలకు చెల్లించాలని కోరారు. బ్రిడ్జికి రెండు వైపులా రైల్వే అధికారులు ఒక చిన్న రోడ్డు మాత్రమే ఏర్పాటు చేశారని తెలిపారు. బ్రిడ్జి పనులు ఆగిపోవడం వల్ల 16,17,1819,20 డివిజన్ లోని దాదాపు 20 వేల జనాభాకు ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు షఫీ, బసవరాజ్, సుబ్బరాయుడు, శ్రీ రంజన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అజుమతుల్లా పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

ప్రజాశక్తి - బద్వేలు : పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయగలమని సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్ యుపిహెచ్‌సి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ మాసోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు అభివృద్ధి అయ్యే ప్రాంతాలు, నివారణ చర్యలు వివరించారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్ గునియా, మెదడు వాపు , ఇతర జ్వరాలు రాకుండా ఉండాలంటే ప్రజలందరి భాగస్వామ్యంతో దోమలను నివారించాలని పేర్కొన్నారు. సామజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎటువంటి జ్వరం వచ్చిన వెంటనే సమజిక ఆరోగ్య కేంద్రానికి కానీ, సమీప, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు, వ్యాధి నిర్ధారణ చేయించుకొని మందులు వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాంధీ నగర్, యుపిహెచ్‌సి, వైద్యాధి కారి, చరత్ చంద్ర సిహెచ్‌సి, బద్వేల్ వైద్యాధి కారులు, భరత్, మిగతా అన్ని విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్ : నెల్లూరు నగరపాలక సంస్థ కార్మికులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర కమిటీ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు తిరుపాల్, సుంకర రవి, ప్రకాష్, శ్రీరామ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పరిష్కారం చర్చలు జరపకుండా కార్మిక నాయకుల్ని, కార్మికుల్ని 50 మంది పైగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ అరెస్టుకు నిరసనగా నెల్లూరు నగరం మున్సిపల్ కార్మికులందరూ టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర అరెస్ట్ చేసి కార్మికులను నాయకులను విడుదల చేయాలని అక్కడికి చేరుకోవడంతో పోలీసులు రౌడీలాగా వ్యవహరించడం, కార్మికులపై లాఠీచార్జ్ చేయడం, గాయాలపాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ మంత్రి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో నెల్లూరు నగరంలో మొదలైన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తుందని హెచ్చరించారు.

5న చలో కడప విద్యుత్ భవన్

ప్రజాశక్తి - కడప అర్బన్ : స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని, పెంచిన ఇంధన సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కడప ఐటిఐ సర్కిల్‌లో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి.మనోహర్, మద్దిలేటి, సుబ్బరాయుడు, రమణయ్య, దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణ మని విమర్శించారు. ఆదాని కంపెనీ 59,21,344 మీటర్లను బిగించాల్సి ఉందన్నారు. ఈ విధానాన్ని అనుమతించొద్దని కోరారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, మల్లికార్జున, తో పాటు స్థానిక ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు డిఎల్ఎస్ఎ దృష్టికి తేవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం ఆశా నిలయాన్ని జడ్జి సందర్శించారు. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆశా నిలయం హెడ్మాస్టర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం ఎన్‌జిఒ ఎన్నికలు ఏకగ్రీవం

- అధ్యక్ష, కార్యదర్శులుగా రత్నం, వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి- కడప అర్బన్


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

కమలాపురం ఎపి ఎన్‌జిఒ ఎన్నికలు కడప ఎన్‌జిఒ హోంలో సోమవారం ఏకగ్రీవంగా నిర్వహి ంచారు. ఎన్నికల అది . కారిగా నరేంద్ర, సహాయ ఎన్నికల అధికారిగా పోల్ రెడ్డి వ్యవహరించారు. అధ్యక్షులుగా ప్రెసిడెంట్ వెంకట రత్నం, సహ అధ్యక్షులుగా రెడ్డి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఇ.వెంకటేశ్వర్లు, బి. కొండారెడ్డి, సి.వసంత (ఉమెన్),కె పవన్ కుమార్, కార్యదర్శిగా వి.వెంకట సుబ్బయ్య, జాయింట్ సెక్రటరీస్‌గా వి.సాదిక్షి, కె.నాగ మునిరెడ్డి, పి ముని కృష్ణయ్ తులసి (ఉమెన్), కోశాధికారిటీ కె.లక్ష్మయ్య ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యవర్గం మూడు సంవత్సరములు కొనసాగుతుందని తెలిపారు ముఖ్య అతిథులు జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, నూతన కార్యవర్గానికి శుభాకా%క్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు టి. శ్రీనివాసులు, బాల పుల్లయ్య, సిటి అధ్యక్షులు చిన్నయ్య, పద్మనాభం, ఎన్‌జిఒ నాయకులు నాగలక్ష్మీరెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 1న జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్‌పి అశోక్‌కుమార్ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ముందుగా కలెక్టర్ దేవగుడిలో ప్రభుత్వ విప్‌ను ఆయన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్మార్ట్ కిచెన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా హెలిప్యాడ్ ఏర్పాటు కోసం ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కనున్న ఖాళీ ప్రాంతాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల భద్రతా అంశాలపై ఎస్‌పి, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామాన్ని పరిశీలిసారు. గ్రామంలోని పెన్షనర్ల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి జీవన స్థితిగతులను కలెక్టర్ తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటు కోసం గూడెం చెరువు గ్రామంలో టిడ్కో కాలనీ ఎదురుగా ఉన్న ఖాళీ మైదానాన్ని పరిశీలించారు. చివరగా పతంగే రామన్న రావు పాఠశాలను సందర్శించారు. వారి వెంట జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, తహశీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, డిఎస్‌పిలు, ఎపి ఎస్‌పిడిసిఎల్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇతర శాఖల అధికారులున్నారు.

విద్యుత్ భారం తగ్గించకపోతే ప్రభుత్వ పతనం తప్పదు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

ప్రజాశక్తి- బద్వేలు

ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాన్ని తగించకోపోతే కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక పెన్షన్స్ అసోసియేషన్ మీటింగ్ హాల్‌లో 'విద్యుత్ ఛార్జీల వ్యతిరేక ప్రజా ఐక్య వేదిక' అంశంపై కె. నాగేంద్రబాబు అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆదాని కిట్ ప్రోకో అవినీతి ఒప్పందాల కారణంగా దేశవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల పేరుతో యూనిట్ కరెంటు రూ. 2.10 నుంచి రూ. 7 వరకు పెంచి ఆదానికి మూడు లక్షల కోట్ల రూపాయలు లాభం చేకూర్చుతున్నారని తెలిపారు. ప్రజలపై భారాలను వేసి ఆర్థిక నిలువు దోపిడీ చేయబోతున్నారని పేర్కొన్నారు. 1998లో టిడిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రయివేటీకరణ ప్రారంభించిందని, తర్వాత కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వం కొనసాగించాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం 5 సంవత్సరాలలో రూ.32 వేల కోట్లు ప్రజలపై విద్యుత్తు భారాలు వేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ. 72 వేల కోట్లు మోపిందన్నారు. 2 కోట్ల స్మార్ట్ మీటర్లు రాష్ట్రంలో బిగించబోతున్నారని వారు తెలిపారు. విద్యుత్ భరాలను విరమించుకోకపోతే వైసిపికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, బిసి సంఘం మాజీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బద్వేలు గురుమూర్తి, ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసుల రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పిచ్చయ్య, రామ సుబ్బారెడ్డి, గంగయ్య, సీమాంక్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ, బెస్త సంఘం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.వెంకటేశు, కౌవర వృత్తిదారుల సంఘం సంఘం నాయకుడు సుబ్బరాయుడు, వడ్డెర ఉత్తిదారుల సంఘం నాయకులు గంప సుబ్బరాయుడు, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాన్ బాషా, బద్వేల్ పట్టణ నాయకులు అన్వర్ భాష, వికలాంగుల సంఘం నాయకులు వెంకటపతి మూరా ప్రసాద్ వెంకటేశ్వర్లు, విద్యుత్తు కార్మిక సంఘం నాయకులు నరసింహులు, ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, ఐద్వా నాయకులు మోక్షమ్మ మస్తాన్ బి దుర్గమ్మ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పథకాలు అమలు చేయాలి

20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : కంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలకు అనుగుణంగా వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాకారానికి కృషి చేయాలని 20 సూత్రాల అమలు కార్యక్రమము చైర్మన్ లంకా దినకరన్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ఆకాంక్షిత జిల్లాలు, మండలాల కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు ప్రాజెక్టుల పురోగతి, మౌలిక సదుపాయాల కల్పనలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు తీరుపై వివిధ శాఖల అధికారులతో 20 పాయింట్ ప్రోగ్రామ్ చైర్మన్ లంకా దినకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నీతీ ఆయోగ్' ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయడానికి కొన్ని ఆకాంక్ష జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. మన రాష్ట్రంల వైఎస్ఆర్ జిల్లా, పాడేరు మన్యం, పార్వతీపురం జిల్లాలను ఎంపిక చేశారన్నారు. ప్రతి మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరానికి ఒకసారి 5 అంశాలకు సంబంధించి కీ పారామీటర్ ఇండికేట్ (కెపిఐ) పాయింట్ల ఆధారంగా ప్రగతిని లెక్కిస్తారని పేర్కొన్నారు. సికె దిన్నె, జమ్మలమడుగులలో కేటాయించి స్మార్ట్ కిచెన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఒ హజరతయ్య, వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్, పశు సంవర్ధన శాఖ జెడి శారదమ్మ,ఆర్డబ్ల్యుయస్ ఈఈ ఏడుకొండలు, ఎల్ డి ఎం.జనార్ధన, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - బద్వేలు : పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం బద్వేల్ పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష,కార్యదర్శులుగా శ్రీనివాసులు, సుశాంత్‌ని, పట్టణ ఉపాధ్యక్షులుగా సుబ్బారెడ్డి, వెంకట సుబ్బయ్య, పవన్, చరణ్, సహాయ కార్యదర్శులుగా రామకృష్ణ, సూర్య, గోవర్ధన్, సురేష్ పట్టణ కమిటీ సభ్యులుగా వేణు, నాగరాజు, బాల కృష్ణ, చరణ్ తేజ మొత్తం 14 మంది సభ్యులతో నూతన పట్టణ కమిటీ ఎన్నుకున్నామని జిల్లా కార్యదర్శి వీరపోగు రవి తెలిపారు. నూతన కమిటీ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పి4 నిర్బంధం సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : జీరో పావర్టీ (పి-4) కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యుటి యఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం కడప యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పేరుతో ముఖ్యమంత్రి ప్రారంభించిన పి-4 కార్యక్రమంలో సంపన్నులు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని, ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమానికి పెద్దగా స్పందన రాకపోవడంతో ఇప్పుడు ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై నెడుతున్నారని పేర్కొన్నారు. పి-4 విధానంలో భాగంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడూ కనీసం ఐదు కుటుంబాలను, ఉపాధ్యాయులు రెండు కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేయాలని విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు లింకులు పంపి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పదే పదే ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఉపాధా యులపై నిర్బంధం చేస్తే పి4 కార్యక్రమాన్ని బహిష్కరించాలంటూ పిలుపు ఇవ్వడానికి వెనుకాడమని తెలిపారు. సమావేశంలో ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహమ్మద్, నాయకులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాటా డుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.



పేదలను ఉద్దేశించి మాట్లాడుతున్న వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్

పేదలకు భూములు పంచే వరకూ ఉద్యమం

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని నాయన పల్లె రెవెన్యూ పొలంలో ప్రభుత్వ భూమిని పేదలకు పంచేవరకూ ఉద్యమం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బండి జకరయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన నరసాపురంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయనపల్లి పొలంలో 129 130 131 217 నెంబర్లలో దాదాపు 800 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ప్రభుత్వం ఫారెస్ట్ ఇచ్చేందుకు సిద్ధపడుతుందని, ఈ ఆలోనను అధికారులు మానుకోవాలని పేర్కొన్నారు. లేకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు అవసరమైతే నిరవధిక దీక్షలు కూడా చేపట్టేందుకు ఈ ప్రాంత ప్రజల సిద్ధంగా ఉన్నారని వారన్నారు. ఈ ప్రాంతంలో భూ కబ్జాదారుల చేతుల్లో వందలాది ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. సావిశెట్టిపల్లె, అక్కెంగుండ్ల, గ్రామ రెవెన్యూ పొలాలలో ఇతర రాష్ట్ర ఇతర జిల్లాలో చెందిన వారికి బినామీ పట్టాలతో భూమి స్వాధీనం చేసుకొని ఉన్నారని, వాటిని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు నాయనపల్లె పొలంలో గతంలో కూడా పేదలు అక్కడ సాగు చేసుకుంటుంటే ఈ మండల రెవెన్యూ అధికారులు వారిపై చర్యలు తీసుకుంటామని బెదిరించి వారిని సాగు చేసుకొని ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. పది రోజుల్లో లోపల తాము ఇచ్చిన దరఖాస్తులకు న్యాయం చేయాలని లేకోపతే తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య, మండల కమిటీ సభ్యుడు బాబు, ప్రజలు పాల్గొన్నారు.

పట్టుదలే విజయ రహస్యం

ప్రజాశక్తి - కడప : కఠోర శ్రమ, అలుపెరుగని ప్రయత్నం, పట్టుదలే విజేతల విజయ రహస్యమని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. ఈనెల 15 నుంచి 25 వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపునకు కళాశాలల నుంచి ఎన్‌సిసి కేడెట్లు హాజరై అక్కడ నిర్వహించిన వాలీబాల్, కల్చరల్, డ్రిల్, టగ్ ఆఫ్ వార్ వంటి విభాగాలలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఇందుకుగాను సోమవారం కళాశాల ప్రిన్సిపల్ వారిని అభినందించారు. ఇందులో భాగంగా కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ కేడెట్లు ఆయుధాలు, కంపాస్, మ్యాప్ వంటి వాటిల్లో శిక్షణ పొందారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్ , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి రమేష్, అధ్యాపకులు డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ పి రవి శేఖర్, సావిత్రి, శివరాం మరియు క్యాడెట్లు పాల్గొనడం జరిగింది.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా గంగాదేవి

ప్రజాశక్తి - చెన్నూరు : ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా గంగాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న కిరణ్ మోహన్‌రావు నెలరోజులపాటు కాళహస్తిలో శిక్షణ తరగతులకు వెళ్లారు. జడ్‌పి సిఇఒ ఉత్తర్వులు మేరకు ఇక్కడ పని చేస్తున్న పరిపాలన అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు తీర్చను కృషి చేస్తానని అన్నారు.

ఎంపిటిసి కృష్ణయ్య మృతి

ప్రజాశక్తి -పెండ్లిమర్రి (కమలాపురం)

పెండ్లిమర్రి మండలం యాదవాపురం గ్రామానికి చెందిన వైసిపి ఎంపిటిసి ఆదిమూలం కృష్ణయ్య(78) సోమవారం ఉదయం మృతిచెందారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో చాతిలో నొప్పిగా ఉందంటే కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆయన నాలుగేళ్ల కిందట ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు భార్య వెంకటసుబ్బమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పర్యాటకం ఘనం.. ఏర్పాట్లు శూన్యం

ఏమైనా జరిగితే ఆధారాలుండవ్ - గండికోట పర్యాటకుల్లో భయాందోళన



గండికోట లోయను తిలకిస్తున్న బెంగళూరు పర్యాటకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోటకెళ్లి అందాలను చూస్తామని.. అక్కడి ప్రశాంత వాతావరణన్ని ఆస్వాదిస్తామని వెళ్లే పర్యాటకుల గుండెల్లో గుబులు మొదలైంది. ఈనెల 13న అదృశ్యమైన ప్రొద్దుటూరు అమ్మాయి మరుసటిరోజు ఉదయం గండికోటలో ఉన్న రంగనాథస్వామి దేవాలయం వెనుక శవమై కనిపించింది. ఈ పరిస్థితుల్లో అక్కడికి వచ్చే పర్యాటకుల్లో భయాందోళన నెలకొంది. ఆ కారణంతోనే ఈనెల 26, 27 శని, ఆదివారాల్లో పర్యాటకుల సంఖ్య బాగా తగ్గిపోంది. అక్కడికి వచ్చిన కొద్దిమందిని పలుకరిస్తే భయంగానే మాట్లాడుతున్నారు. ప్రశాంతంగా ఉందామని గండికోటకు వస్తే ఇక్కడ ఉన్న సమస్యలు మమ్మల్ని మరింత భయాందోళనకు గురి చేస్తున్నాయని పర్యాటకులు చెబుతున్నారు. చాలా అందమైన లోకేషన్స్, కట్టడాలు చూపరులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు, కనీస వసతులు కల్పించలేదన్నారు. పర్యాటకుల అవసరాల మేరకు కనీస వసతులు కల్పించడంలో ఆర్కియాలజీ, జిల్లా పర్యాటకశాఖ అధికారులు కానీ చర్యలు చేపట్టకపోవడం బాధాకరమంటున్నారు. కేవలం ఇక్కడ ఒకే ఒక సెల్ జియో టవర్ కలదు. ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్ ఇతర నెట్‌వర్క్ సక్రమంగా రావడం లేదు. ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ వారు కూడా తక్కువ సంఖ్యలో ఉన్నారు. ముగ్గురు మాత్రమే పర్మినెంట్ సభ్యులని, ఒకరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది కలరు. శని, ఆదివారాల్లో కానీ ఇతర రోజులలో గండికోటలో గ్రాండ్ కెన్యాన్ ప్రదేశంలో, రంగనాథ స్వామి దేవాలయంలో, జుమ్మా మసీదు, ధాన్యాగారం, మాధవరాయ స్వామి దేవాలయం, జైలు, చార్మినార్ వంటి లొకేషన్స్ ఉన్నాయి. ఇవి పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఆయా లొకేషన్స్‌లో తగినంత ఆర్కియాలజీ సిబ్బంది లేకపోవడంతో అక్కడున్న రాళ్లు, జుమ్మా మసీదు, చార్మినార్, కోట ముఖద్వారం, ఇతర ప్రదేశాల్లో వ్యక్తిగత పేర్లు, ప్రేమ గుర్తులు ఎక్కడ చూసినా కనపడతాయి. వీటిని చూస్తే సహజ సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు వచ్చిన పర్యాటకుల మనసు చికాకు పడుతోంది. ఇలా పిచ్చిరాతల దర్శనానికి కారణం ఆర్కియాలజీ సిబ్బంది కేవలం నలుగురు మాత్రమే ఉండడమని తెలుస్తోంది. పర్యాటకులకు వారు సరైన సమాచారం ఇవ్వలేకపోతున్నారు. 'ప్రజాశక్తి' సిబ్బందిని వివరణ అడిగితే.. గ్రామాల్లో నూతన కట్టడాలు కట్టకుండా, పర్యాటకులు సహజ సౌందర్యాలను నాశనం చేయకుండా చూడడం మా పని అంటున్నారు. తాము ఇక్కడ ఎంటిఎస్‌గా పని చేస్తున్నాం (మల్టీ టాస్కింగ్ స్టాఫ్), మాతోపాటు కొంతమంది సిబ్బంది ఉంటే ఎక్కడ ఏం జరుగుతుందో తాము తెలుసుకోగలమంటున్నారు. ఇక కోట వెలుపలికి వస్తే పర్యాటకులకు మరింత ఆనందాన్ని ఇవ్వడానికి పర్యాటక శాఖ అధికారులు అడ్వెంచర్‌తోపాటు హార్స్ రైడర్ సౌకర్యాన్ని కల్పించారు. ఎక్కడే కానీ తాగడానికి మంచినీటి సరఫరా కనబడదు.

ఏమి జరిగినా ఎవరికీ తెలీదు..

కోట బయటి భాగంలో ప్రధాన ప్రదేశాల్లో మాత్రమే సీసీ కెమెరాలు కనపడతాయి. ఇతర ప్రదేశాలలో సీసీ కెమెరాలు లేవు. కోట లోపల ఎక్కడ, ఏం జరిగినా ఆధారాలు దొరకడానికి చాలా కష్టంగా మారింది. అందుకు ఉదాహరణ ఈనెల 14న జరిగిన వైష్ణవి హత్య. మైనర్ బాలికను అతి దారుణంగా, కిరాతకంగా కొట్టి చంపి ముళ్లపొదలో వేస్తే ఎవరు చంపారు..? ఏంటి..? అనే ప్రశ్నలకు సమాధానం ఇంతవరకు దొరకలేదు. సీసీ కెమెరాలు, సరైన నెట్‌వర్క్ లేకపోవడమే ఇందుకు కారణమని పర్యాటకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ నెల14, 15 తేదీల్లో ఎస్పీ ఆదేశాల మేరకు ఓ ప్రయివేట్ ఏజెన్సీ వారు వచ్చి ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు బిగించాల్సి ఉంటుందోనని చూసుకొని వెళ్లినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర విభజన జరిగాకే గండికోటకు గుర్తింపు..

రాష్ట్ర విభజన జరగకముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గండికోటను గుర్తించి హరిత టూరిజం అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సూచనల మేరకు అప్పట్లో హోటళ్లు కట్టారు. ఆ తర్వాత గండికోట పర్యాటకం మూలన పడింది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ప్రస్తుత



బాలిక హత్య అనంతరం గండికోటలో పోలీసులు

ముఖ్యమంత్రి చంద్రబాబు గండికోట పర్యాటకాన్ని గుర్తించి ఇక్కడికి ఆయన స్వయంగా వచ్చి రాత్రి బస చేసి ఉదయాన్నే గండికోట మొత్తాన్ని చూసి చాలా ఆహ్లాదకరంగా ఉంటుందని భావించారు. పర్యాటకులకు ఎంతగానో గండికోట ఆకర్షిస్తుందని చెప్పి అమెరికాలో ఉన్న గ్రాండ్ కెన్యాన్ కంటే అందంగా ఉందని నాడు చెప్పి అందుకు తగ్గట్టుగానే ప్రతి సంవత్సరం గండికోట వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత కరోనా సమయంలో వారోత్సవాలు జరగలేదు. తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గండికోట పర్యాటకానికి అంతగా ప్రభావం చూపకపోవడం కేవలం ఒబెరాయ్ హెూటల్ ప్రస్తావన మాత్రమే తీసుకురావడం జరిగింది. అది కూడా ఆచరణలో లేదు. కానీ విభజన తర్వాత గండికోటకు వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. బెంగళూరు, చెన్నై, హైదరాబాదు వంటి నగరాలతోపాటు ఉత్తర భారతదేశం చెందిన సాఫ్ట్వేర్లు, ఉద్యోగస్తులు అధికంగా వస్తున్నారు. కానీ అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తే గండికోట అభివృద్ధి చెందుతుందని పర్యాటకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సరైన సెల్ నెట్ వర్క్ లేదు..



పర్యాటకులకు సరైన నెట్‌వర్క్ లేదు. అందుకు తగ్గ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేవాలి. ఇక్కడి సహజ సౌందర్యాన్ని, కట్టడాలను కాపా డడానికి చర్యలు తీసుకోవాలి. మరింత అభివృద్ధి చర్యలు చేపట్టాలి. గండికోటలో హత్య జరిగిందని ఇక్కడికి వచ్చాక తెలిసింది. అందుకే ఇక్కడికి స్థానిక, జిల్లా, రాష్ట్ర ప్రజలు తక్కువగా వచ్చారు.

- ప్రేమ్‌కుమార్, పర్యాటకుడు, హైదరాబాద్



పైడిపాలెం రిజర్వాయర్‌లోకి వస్తున్న కృష్ణా జలాలు

పైడిపాలెం చేరిన కృష్ణా జలాలు

- రోజుకు 300 క్యూసెక్కులు పంపింగ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం మండలం పైడిపాలెం రిజర్వాయర్‌లోకి కృష్ణా జలాలు చేరాయి. సోమవారం ఉదయం గండికోట నుంచి కృష్ణా జలాలను మూడు పంపులతో లిఫ్టింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మధ్యాహ్న 1.30 గంట సమయానికి 300 క్యూసెక్కుల నీరు పైడిపాలెం రిజర్వాయర్ లోకి చేరాయి. రిజర్వాయర్ సామర్థ్యం ఆరు టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.4 టిఎంసిల నీరు నిల్వ ఉంది. మిగిలిన 1.6 టిఎంసి నీటిని నిలువ చేయాలనే లక్ష్యంతో మళ్లీ గండికోట నుంచి నీటి పంపింగ్ ప్రారంభించారు.

ఈ ఏడాది1.5 టిఎంసి విడుదల..

ఈ ఏడాది సీజన్ నుంచి ఇప్పటివరకు రైతుల అవసరాలకు 1.5 టిఎంసి నీటిని విడుదల చేసినట్లు జికెఎల్ఐ ఇఇ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని నీటిని పంపింగ్ చేశామన్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామన్నారు.



అన్నదాన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లాడుపల్లె అభివృద్ధికి సహకరించాలి

- ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్ కోరారు. సోమవారం నాగులచవితి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటున్నారన్నారు. ఆలయానికి వచ్చిన వారు ఆకలితో ఇంటికి వెళ్లొద్దన్నదే తమ ఆశయమన్నారు. అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయానికి మరింత శోభను తీసుకొస్తామన్నారు. దాతలు కూడా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



నూతన కమిటీతో గోడపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా అధ్యక్షులు రాహుల్

జమ్మలమడుగు ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కన్వీనింగ్ కమిటీని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు దాసు, ఎ.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. 15 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా హరిబాబు, కార్యదర్శిగా జెర్మీయ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని పట్టణ కమిటీకి సూచించారు. విద్యాదీవెన, వసతిదీవెన, రూ.6,400 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 77ను రద్దు చేయాలన్నారు. పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెర్ కల్పించాలన్నారు. తల్లికివందనం పథకం బేషరతుగా అందరికీ అమలు చేయాలన్నారు. డిగ్రీ మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా సంక్షేమ హాస్టళ్లు రోజురోజుకూ దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చదువు పేరుతో ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్డగోలుగా రూ.వేలు, లక్షలు వసూలు చేస్తున్నారని వివరించారు. విద్యార్థుల సమస్యల పట్ల రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. బద్వేల్ ప్రాంతంలో ఈనెల 30, 31న జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. ఆమేరు స్థానిక ఆర్అండ్‌బి వద్ద కరపత్రాలను విడుదల చేశారు.

పనులు వేగవంతం చేయాలి : సిపిఎం

జమ్మలమడుగు ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ పనులను వేగవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గోపాల్‌దాస్ ఏసుదాసు డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే పరోక్షంగా లక్షల మందికి, ప్రత్యక్షంగా 25 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఉపాధి కల్పన జరుగుతూనే వ్యాపారాభివృద్ధి కూడా చెందుతుందన్నారు. ఈ తరుణంలో జమ్మలమడుగు అభివృద్ధికి నాంది పలుకుతుందన్నారు.

భావితరాల కోసం ప్రకృతిని కాపాడుకోవాలి

వేంపల్లె : భావి తరాల కోసం ప్రకృతిని కాపాడు కునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంత రించి పోతున్న సహజ వనరులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సార్వభౌమత్వం ఫలితంగా మానవాళికి మేలు జరుగుతుందన్నారు. మొక్కలను విరివిగా పెంచాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ, డాక్టర్ ఎల్.నాగలక్ష్మి దేవి, జి.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

చరిత్ర నిపుణుల కమిటీలో బాలకొండ గంగధర్

ప్రజాశక్తి - వేంపల్లె



వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్న డాక్టర్ బాలకొండ గంగధర్ చరిత్ర నిపుణుల కమిటీకి ఎంపికయ్యారు. ఉన్నత విద్యా పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉన్నత ఆశయంతో కేంద్ర ప్రభుత్వ అధీనంలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రారంభించిన నూతన విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా వివిధ శాఖలకు నిపుణుల కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో నూతన పాఠ్య ప్రణాళికలు ఏర్పాటు చేయగా వాటిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర శాఖాధిపతిగా ఉన్న డాక్టర్ బాలకొండ గంగాధర్ నిపుణుల కమిటీలో సభ్యుడిగా అవకాశం దక్కించుకున్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాశాఖ చైర్మన్ మధుమూర్తి పర్యవేక్షణలో డిగ్రీ మూడేళ్ల మేజర్, మైనర్ సబ్జెక్టుల సంబంధించి పాఠ్య ప్రణాళికను తయారు చేయడం ప్రారంభించారు. చరిత్ర శాఖకు సంబంధించి 60ఏళ్లుగా సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అనేక అంశాలను ప్రాముఖ్యత ఇచ్చే విధంగా కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆదేశించారు. కొత్త పాఠ్య ప్రణాళికలో మన సంస్కృతి, వారసత్వ చరిత్రను ఎలాంటి వివక్షత లేకుండా అన్ని విషయాలను చేర్చినట్లు గంగధర్ తెలిపారు. ఈ నిపుణుల కమిటీకి ఆచార్య డి.వెంకటేశ్వరరెడ్డి చైర్మన్‌గా వ్యవహరించగా ఆచార్య కృష్ణ ప్రసాద్, ఆచార్య బాలకొండ గంగాధర్, సహాయ ఆచార్యులు డాక్టర్ రాజమహమ్మద్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ సహదేవులు సభ్యులు వ్యవహంచనున్నారు. నూతన పాఠ్య ప్రణాళికలో ఒకవైపు ఆంధ్రప్రదేశ్ ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక చరిత్రలతోపాటు భారతదేశ చరిత్రను కూడా సంపూర్ణంగా చేర్చినట్లు తెలిపారు. అంతేగాక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే అన్ని పోటీ పరీక్షలకు చరిత్ర చాలా ముఖ్యమైందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని వాటిని కూడా పూర్తి చేసినట్లు చెప్పారు. డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే పర్యాటక రంగం, పర్యాటక గైడెన్స్, మ్యూజియం, జర్నలిజం వంటి కోర్సులను కూడా ఈ పాఠ్య ప్రణాళికలో చేర్చి విద్యార్థులకు బహుళ అవకాశాలు కల్పించడానికి ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ బాలకొండ గంగాధర్ వివరించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రతిభ చూపిన సంసిద్ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయ స్థాయిలో జరిగిన కృత్రిమ మేధస్సు ఆధారిత (2025) పోటీల్లో సంసిద్ సతీష్‌రెడ్డి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ పరిమళాదేవి పేర్కొన్నారు. చెన్నైలోని ఐఐటి రిసెర్చ్ పార్క్‌లో ఎవాల్వ్ సంస్థ మే నెలలో కృత్రిమ మేధస్సు ఆధారిత పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 35 పాఠశాలలు సిబిఎస్ఇ పాఠశాలల నుండి 14,000 వేల మంది విద్యార్థులు పోటీలకు హజరైనట్లు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 7వ తరగతికి చెందిన వెన్నిలా గ్రేస్ అనే విద్యార్థిని మూడవ బహుమతిని సాధించినట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అధారంగా ప్రాజెక్టులను తమ పాఠశాల విద్యార్థులు రూపొందించారన్నారు. తమ విద్యార్థులు భవిష్యత్తు సమస్యలకు పరిష్కారాల మార్గంపై ఎ-1 పరిజ్ఞానంతో రూపొందించారని వివరించారు. ఆ మేరకు విద్యార్థులకు అవార్డులు వచ్చాయన్నారు. ఏడు మంది విద్యార్థులు కొత్త ఆలోచనలు, నూతన ప్రదర్శనలకు సంబంధించి జాతీయ స్థాయిలో ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు చెప్పారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

జిఒ 1214ను రద్దు చేసి, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను పరిష్కారించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా 1996 చట్టం అమలు చేసి 12 రకాల సౌకర్యాలు అందించాలని డిమాండ్ చేశారు. లేబర్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. కొత్త గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పాత వాటికి రెన్యూవల్ చేయాలని కోరారు. 50 సంవత్సరాల నిండిన భవన నిర్మాణ కార్మికులకు అందరికి ఫించన్ రూ.6 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం బోర్డు నుండి వాడుకున్న నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చల్లా బాలాజీ, దస్తగిరి, నాగేశ్వరరావు, బుజ్జి, లక్ష్మి నారాయణ, నాగేంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

ఏనుగుల బారి నుంచి రైతులను రక్షించండి



విలేకరులతో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఏనుగుల దాడితో పంట పొలాల వద్ద ఉంటున్న రైతులు మృత్యువాత పడుతున్నారని వారిని కూటమి ప్రభుత్వం రక్షించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆహారం, నీటి కొరత, గుంపుల మధ్య పోరాటం తదితర కారణాల వల్ల ఏనుగులు అడవులు వదిలి సమీపంలోని గ్రామాల్లోకి వచ్చి పంట పొలాలను తిని, తొక్కి నాశనం చేస్తున్నాయన్నారు. ఈ ఏడాది జనవరి 18న చంద్రగిరి మండలం, కందులవారిపల్లె ఉప సర్పంచ్ రమేష్ చౌదరిని ఏనుగులు తొక్కి చంపాయని తెలిపారు. ఏప్రిల్ 25న చిన్నగొట్టిగళ్ళు మండలం చిట్టేచర్ల గ్రామానికి చెందిన సిద్దయ్యను చంపగా, ఈ నెల 26న చిత్తూరు జిల్లా సోమల మండలం దిగువ కొత్తూరు గ్రామానికి చెందిన రామకృష్ణరాజు అనే రైతును పొలం వద్ద ఏనుగులు తొక్కి చంపాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిత్తూరు, అన్నమయ్య, విజయనగరం జిల్లాలలో ఏనుగుల దాడులు ఎక్కువయ్యాయని తెలిపారు. ఏనుగుల దాడిలో ఇటీవల కాలంలోనే దాదాపు 30 మంది చనిపోయారని చెప్పారు. 300 ఎకరాల్లో పంట ధ్వంసమైందన్నారు. కర్ణాటకకు పోయి పవన్‌కల్యాణ్ తెచ్చిన కుంకీ ఏనుగులు ఏమయ్యాయో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. స్వర్ణాంధ్ర, వికసిత ఆంధ్ర సంగతి దేవుడెరుగు.. ముందు ఏనుగుల బారి నుండి రైతులను, ప్రజలను కాపాడాలని తులసిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. కడప జిల్లాలో ప్రయివేటు రంగంలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయా లని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.



బక్కనగారిపల్లెలో ముగ్గురాయి మైనింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ముగ్గురాయి గనుల్లో అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లి, వేముల మండలాల్లో ఉన్న బైరటీస్ (ముగ్గురాయి) మైనింగ్‌లను మైనింగ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం వేంపల్లి మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామం వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్‌లను జిల్లా మైనింగ్ అధికారి వెంకటసాయి, విజిలెన్స్ ఏడి ఎం.సుబ్రహ్మణ్యం తనిఖీలు చేశారు. ఇటీవల పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి, వేముల మండలాలలో ప్రభుత్వానికి ఎటువంటి అనుమతులు, రాయల్టీలు చెల్లించకుండా కోట్ల రూపాయల ముగ్గురాయిని కొల్లగొడుతున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల వేముల మండలంలో ఎన్‌సిఎల్టీ ఆధీనంలో ఉన్న రూ.10 కోట్ల విలువచేసే ముగ్గురాయిని రాత్రికి రాత్రే దొంగలించారని తెలిపారు. ఈ నేపథ్యంలో తూతూ మంత్రంగా అధికారులు తనిఖీలు చేపట్టారు. అప్పటికే అక్రమార్కులకు అనుకూలంగా ఉన్న అధికారులు సమాచారాన్ని అందించడంతో మైనింగ్ పనులను చేయొద్దని చెప్పడంతో జాగ్రత్త పడ్డారు. తనిఖీల్లో అక్రమార్కులు మైనింగ్ పనులు చేయకపోవడంతో తూతూ మంత్రంగా అక్కడికి వచ్చి అనుమతులు లేనిదే ఎవరు మైనింగ్ పనులు చేయొద్దని వాచ్‌మెన్‌లకు సమాచారం ఇచ్చి వెళ్లిపోయారు. వేంపల్లి, వేముల మండలాల్లో సుమారు పదిచోట్ల అక్రమ మైనింగ్ నడుపుతున్నట్లు సమాచారం. ఇటీవల వేంపల్లి మండలం కత్తులూరు గ్రామ సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్ పనుల్లో వేముల మండలం అమ్మయ్యగారిపల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన రామచంద్ర మట్టి పెళ్లలు విరిగిపడి మృతి చెందాడు. ఇవన్నీ కూడా మైనింగ్, విజిలెన్స్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. కార్యక్రమంలో మైనింగ్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో ఎంపిపి వీరనారాయణరెడ్డి

తనతో నడిచిన వారిని మరచిపోను

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

తనతో నడిచిన నాయకుడు, కార్యకర్తను ఏనాడూ మరిచిపోనని ఎంపిపి వీరనారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యోగి వేమారెడ్డి అన్నదాన సత్రంలో సోమవారం ఆయన కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ 45 ఏళ్లుగా రాజకీయ అనుభవం, ప్రజాప్రతినిధులుగా ఎల్లప్పుడూ ప్రజల సేవలో తమ కుటుంబం ఉంటోందన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ చేస్తున్న అభివృద్ధి చూసే వారి వెంట తాను అడుగులు వేయాలని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశానని తెలిపారు. బ్రహ్మంగారిమఠం అభివృద్ధి చేసే ఎవరికైనా తాను మద్దతుగా నిలుస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో జెఇ నరేంద్రరెడ్డి తెలిపారు. ప్రజలు, రైతులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

రేపు చక్రాయపేట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చక్రాయపేట

ఈనెల 30న బుధవారం చక్రాయపేట మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కులాయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, వైద్య ఆరోగ్యం, పశు సంవర్ధక, రెవెన్యూ, పౌర సరఫరా, వెలుగు, ఉద్యాన, తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆమె కోరారు. మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆరోగ్యానికి మించిన సంపద లేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆరోగ్యానికి మించిన సంపద ఏదీ లేదని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవం సందర్భంగా కామనూరు పిహెచ్‌సి పరిధిలోని కామనూరు, ఉప్పాగు, గోపవరం, హౌసింగ్ బోర్డు, ఆచార్ల కాలనీ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వైరల్ సంబంధిత కాలేయ వ్యాధి ప్రపంచంలో ఎక్కువగా ఉందన్నారు. మంచి మందులు కూడా ఉన్నాయన్నారు. హెపటైటిస్ టీకా అందుబాటులో ఉందని తెలిపారు. 2030 నాటికి వైరల్ ద్వారా వచ్చే కాలేయ వ్యాధులను నిర్మూలించడానికి ప్రణాళికలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మధు, ఫార్మాసిస్ట్ సురేంద్ర, ల్యాబ్ టెక్నీసియన్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఆరోగ్య సిబ్బంది రాధ, గురమ్మ, జాస్మిన్, హేమ, ప్రభావతి, ప్రజలు పాల్గొన్నారు

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - తొండూరు

కోరవానిపల్లె గ్రామంలోని ఓ ఇంట్లో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపారు. సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారన్నారు. వారి వద్ద నుండి పేకాట ముక్కలు, రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాల నిర్వహణపై దృష్టి పెడతామని ఆయన తెలిపారు.